క్లుప్తంగా

ప్రథమ చికిత్స అవసరం



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

పులివెందుల టౌన్ : ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడానికి ప్రథమ చికిత్స చాలా అవసరమని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జువాలజీ డిపార్ట్‌మెంట్ కోర్సు కో ఆర్డినేటర్ శ్రీనిత ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై సర్టిఫికెట్ కోర్సు ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చిన్న, చిన్న గాయాలకు, సాధారణ శరీర రుగ్మతలకు నిపుణుల వైద్యం అందేవరకు తాత్కాలికంగా చేసే ప్రథమ చికిత్స నేర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. డాక్టర్ యు.శ్రీనిత మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారికి, మంటలలో చిక్కుకున్న వారికి, పాము కాటుకు గురైనప్పుడు రక్తం అధికంగా పోతున్న సమయంలో, ఆత్మహత్య ప్రయత్నంలో ఉన్న వారికి ప్రథమ చికిత్స అందించి కాపాడటం చాలా అవసరమన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రథమ చికిత్స కోర్సు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త చెరువు నిర్మాణానికి స్థల పరిశీలన



కొత్త చెరువు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

లింగాల : మండలంలోని లోపట్నూతల గ్రామంలో మంగళవారం ఇరిగేషన్ శాఖ ఈఈ వెంకట్రామయ్య జలవనరుల శాఖ అధికారులతో కలిసి కొత్త చెరువు నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త చెరువు నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని, త్వరలో కొత్త చెరువు నిర్మాణ పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ జోగిరెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చేస్తాం



పాపాఘ్ని నదిలో నూతన ఫిల్టర్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్, తదితరులు

వేంపల్లె : ప్రజలకు తాగునీటి సమస్యను తీర్చేందుకు పాపాఘ్ని నదిలో కొత్త ఫిల్టర్లను వేసినట్లు సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం స్థానిక పాపాఘ్ని నదిలో వేసిన ఫిల్టర్లను సర్పంచ్ తనిఖీ చేసి నీటి మట్టం పరిశీలించేందుకు మోటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపాఘ్ని నదిలో నీటి శాతం తగ్గడంతో ఆయా ప్రాంతాలకు తాగునీటి సమస్య ఉండటంతో ఫిల్టర్లను వేయాలని అధికారులకు కోరడంతో నూతన ఫిల్టర్లను వేశారన్నారు. దీనివల్ల వేంపల్లెలోని ఆయా ప్రాంతాల ప్రజలకు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. నీటి సమస్య ఉండకూడదనే ఉద్దేశంతో నదిలో 5 ఫిల్టర్లను వేసి పైపు లైన్ పనులు చేపట్టామన్నారు. పంచాయతీలో పనిచేసే వాటర్ స్కీమ్ సిబ్బంది కూడా నీటి సమస్యను గుర్తించి అధికారులు తన దృష్టికి తీసుకరావాలన్నారు. అధికారుల దృష్టికి ప్రజలు తీసుకొచ్చే వరకు వేచి ఉండరాదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కసిరెడ్డి ఆదినారాయణరెడ్డి, సునీల్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ



మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు రూరల్ : గండికోటలో హత్యకు గురైన మృతురాలి కుటుంబాన్ని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి మంగళవారం పరామర్శించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మృతురాలి మృతదేహాన్ని సందర్శించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించారు. హత్యకు గల కారణాలను పోలీసులను అడి తెలుసుకున్నారు. హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. పరామర్శించిన వారిలో మాజీ ఎంపీపీ పొన్నపురెడ్డి గిరధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోరెడ్డి మహేశ్వరరెడ్డి, ఎంబీ ప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, బొనం సురేష్, సుబ్రమణ్యం తదితరులు ఉన్నారు.

ఎండిపోతున్న ఎర్రబల్లె చెరువు

- ఎత్తిపోతల పథకంలో మరమ్మతులకు నోచుకోని మోటార్లు
- బోర్లలో నీరు ఎండిపోతుందంటున్న రైతన్నలు



ఎర్రబల్లె చెరువులో అడుగంటిపోతున్న భూగర్భజలాలు

పులివెందుల రూరల్ : మండలంలోని ఎర్రబల్లె పంచాయతీ పరిధిలోని 8 గ్రామాల్లోని తోటల వద్ద భూగర్భజలాలు ఎండిపోతున్నాయని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎర్రబల్లె చెరువుకు మూడేళ్ల క్రితం వర్షాలు బాగా పడి వాగులు, వంకలు నీటితో ప్రవహించి నిండు కుండలా వర్షపు నీటితో ఉండేది. దీంతో బోరు బావులలో భూగర్భ జలాలు పూర్తిస్థాయిలో ఉండేవి. మూడేళ్ల నుంచి ఎర్రబల్లె చెరువులో చుక్క నీరు లేకుండా ఎండిపోయింది. దీంతో పరిసర ప్రాంతాల్లో ఉన్న బోరు బావులలో భూగర్భజలాలు ఇంకిపోతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నల్గొండువారిపల్లె గ్రామంలో చెరువు దగ్గర ఉన్న ఒక తోటలో 1430 అడుగుల లోతు వరకు బోరు వేసినా చుక్క నీరు పడలేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొంతమంది రైతులు లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలో ఉన్న అన్నయ్య కుంటకు నీరు వస్తుండటంతో గ్రామానికి చెందిన రైతులు అన్నయ్య కుంట వరకు మోటార్ల ఏర్పాటు చేసి అక్కడ నుంచి నీటిని తమ తోటలకు సరఫరా చేస్తున్నారు. ఎర్రబల్లె చెరువులో నీరు లేకపోవడంతో 8 గ్రామాల ప్రజలకు తాగునీటి సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. ఎర్రబల్లె చెరువుకు సంబంధించి ఎత్తిపోతల పథకం ద్వారా పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే దారిలో పీబీసీ కాలువ నుంచి నీటిని పంపింగ్ చేసే విధంగా నాలుగు మోటర్లను గత ప్రభుత్వం ఏర్పాటు చేసి ఎర్రబల్లె చెరువు ఎండిపోకుండా నీటిని కూడా పంపిణీ చేయడం జరిగింది. రూ.60వేల నుంచి లక్ష రూపాయలు ఖర్చు పెడితే నాలుగు మోటార్లకు మరమ్మతులు చేయవచ్చునని రైతులు అంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో మోటర్లు ఎందుకు పనికి రాకుండా అలాగే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మోటార్లకు మరమ్మతులు చేయించి ఎర్రబల్లె చెరువుకు పీబీసీ కాలువ నుంచి నీరు పంపించే విధంగా చర్యలు చేపట్టి ఆ ప్రాంత ప్రజల గొంతు తడిపేలా చూడాలని రైతులు కోరుతున్నారు

మోటర్లు మరమ్మతులు చేయాలి



ఎర్రబల్లె చెరువు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని పంపించడానికి నల్లపురెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే రోడ్డు సమీపంలో పంపింగ్ చేసే మోటర్లు మరమ్మతులు గురయ్యాయి. సంబంధిత అధికారులు స్పందించి మోటార్లకు మరమ్మతులు చేసి పీబీసీ కాలువ ద్వారా ఎర్రబల్లె చెరువుకు నీటిని పంపింగ్ చేసి రైతులను ఆదుకోవాలి.

– డిష్ వెంకటరెడ్డి, రైతు, నల్లపురెడ్డిపల్లె

బోర్లు వేసినా చుక్క నీరు పడటంలేదు



భూగర్భజలాలు లేక ఎర్రబల్లె చెరువు ఎండిపోతోంది. దీంతో 8 గ్రామాల ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. 1000 అడుగుల నుంచి 1500 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా చుక్కనీరు పడటం లేదు. నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మోటార్లకు మరమ్మతులు చేయాలన్నారు.

– వెంకట్రామిరెడ్డి, రైతు, నల్లగొండువారిపల్లె

ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో నిషేధించాలి



అవగాహన సదస్సులో కమిషనర్, ప్రిన్సిపాల్, తదితరులు

పులివెందుల టౌన్ : ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిస్థాయిలో నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. మంగళవారం పట్టణంలోని స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ఫాదర్ జోజిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ వన చిన్నప్పలు పర్యావరణం పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు మున్సిపల్ కమిషనర్ హాజరై ప్లాస్టిక్ వాడకంవల్ల రాబోయే రోజుల్లో వచ్చే సమస్యల గురించి, ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి కలిగే ఇబ్బందులు, వాటివల్ల వచ్చే రోగాలు, నష్టాల గురించి వివరించారు. ప్లాస్టిక్ కవర్ల స్థానంలో జూట్, పేపర్ వంటి పదార్థాలను వాడాలని వివరించారు. కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కళ్యాణిరెడ్డి, దేవిరెడ్డి హిమజ, కళాశాల, మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

వేంపల్లె : మండలంలోని టి.వెలమవారిపల్లె గ్రామ సమీపంలో జూదమాడుతున్న 5 మందని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు మంగళవారం ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు టి.వెలమవారిపల్లె గ్రామ సమీపంలో ఉన్న ప్రసాద్ రెడ్డి నిమ్మ తోటలో తనిఖీ చేయగా, జూదమాడుతున్న వారిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. రూ.5,210ల నగదుతోపాటు 5 మంది జూదరులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ముద్దనూరు : మండలంలోని ముద్దనూరు, బొందలకుంట, మంగపట్నం విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం వుంటుందని ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పథకం కింద 3 ఫేస్ సరఫరా అందించడానికి చేపడుతున్న పనుల కారణంగా ఈ అంతరాయం వుంటుందని వినియోగదారులు గమనించాలని ఆయన తెలిపారు.

మృతిపై విచారణ జరపాలి

కడప ఎడ్యుకేషన్: ప్రొద్దుటూరు పట్టణంలోని సార్వకట్ట వీధిలో నివాసముండే మైనర్ బాలికను ప్రేమ పేరుతో నమ్మించి అతి దారుణంగా ప్రాణం తీసిన ఘటనపై సమగ్ర విచారణ జరపాలని అఖిల భారత విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్ డిమాండ్ చేశారు. విలేకరులతో కడపలో ఆయన మాట్లాడుతూ ప్రేమ పేరుతో అమ్మాయిలను శారీరక ఇబ్బందులకు గురి చేయడం. మాట వినకపోతే చంపడం ఈ సమాజంలో పరిపాటిగా మారిందన్నారు. ఇలాంటి కిరాతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లాలి



వేంపల్లెలో బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ పత్రాలను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



జమ్మలమడుగులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి



చింతకొమ్మదిన్నెలో బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ క్యూఆర్ కోడ్ పత్రాలను ప్రదర్శిస్తున్న నరేన్ రామాంజులరెడ్డి, తదితరులు

వేంపల్లె : రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి వైఎస్సార్‌సీపీ నాయకులు తీసుకెళ్లాలని జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను ప్రకటించడం జరిగిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించారన్నారు. ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఆయా గ్రామాల్లోని ప్రతి గడప గడపకు తిరిగి కూటమి ప్రభుత్వ పాలనలో కుటుంబానికి ఎంత నష్టమో తెలపాలన్నారు. యవతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత పథకం అమలు చేయలేదన్నారు. ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం చెప్పి ఎగరగొట్టడం జరిగిందన్నారు. ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు చెప్పి మోసం చేసిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కూడా లేదన్నారు. ప్రతి ఒక్కరికి చంద్రబాబు మ్యానిఫెస్టోను గుర్తుకు తేవాలన్నారు. అనంతరం మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జగనన్న అమ్మఒడి, వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా, వైఎస్సార్ కాపు నేస్తం, వైఎస్సార్ సంపూర్ణ పోషణ, జగనన్న విదేశీ విద్యా దీవెన, వైఎస్సార్ లా నేస్తం, వైఎస్సార్ హౌసింగ్, వైఎస్సార్ కంటి వెలుగు, జగనన్న తోడు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, జగనన్న ఇంటి స్థలాలు, జగనన్న గోరుముద్ద, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలు అమలయ్యేవన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో పథకాలన్నీ రద్దు చేసిందన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ అనే క్యూఆర్ కోడ్ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు రవిశంకర్‌గౌడ్, మునీర్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కటిక చంద్రశేఖర్, షాదీఖానా కమిటీ మాజీ చైర్మన్ బీఎస్ షేక్షావలి, మాజీ సొసైటీ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార సంయుక్త కార్యదర్శి నిసార్, రామచంద్రారెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు రూరల్ : ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నదని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వంగల భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన ×బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ¥ కార్యక్రమాన్ని నిర్వహించారు. కూటమి నాయకులు ప్రజలను నమ్మించి చేసిన మోసాన్ని ఇంటింటికి వెళ్లి ఎండగట్టేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, ఎంబీ ప్రసాద్‌రెడ్డి, బోనం సురేష్, ఉప్పలపాడు యోబ్, సుబ్రమణ్యం, నక్కా నారాయణ, తాన నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాల హామీలు అమలు చేయకుండా కాలం గడుపుకుంటోందని వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ కన్వీనర్ నరేన్ రామాంజులరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక రాజారాణి కల్యాణ మండపంలో మండల వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ ఫెయిల్ అయిందన్నారు. మహిళలకు ఇచ్చిన అనేక సంక్షేమ పథకాలను కూడా మరిచిపోయిందన్నారు. అనంతరం మండల పార్టీ నాయకులతో కలసి ఆయన బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ అనే వివరాలు గల క్యూఆర్ కోడ్ ఆవిష్కరించారు. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కూటమి పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలు, చంద్రబాబు ప్రభుత్వం చేస్తున్న మోసాలు వివరంగా తెలుస్తాయన్నారు. కార్యకర్తలు అందరూ అవగాహన కల్పించుకుని ప్రజలలోకి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో కడప నగర డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, కార్పొరేటర్ చంద్రహాసరెడ్డి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యదర్శి గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉప మండలాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, మహిళా నాయకురాలు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



ఉల్లి పంటలో తెగుళ్ల నివారణపై వివరిస్తున్న ఏఓ ఓబులేసు

వేముల : ఖరీఫ్‌లో పంటల సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏఓ ఓబులేసు సూచించారు. మండలంలోని చింతలజూటూరు, కుప్పగుట్టపల్లె గ్రామాల్లో ఉల్లి, పత్తి పంటలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉల్లి పంటకు సకాలంలో ముందుజాగ్రత్తగా మందులు పిచికారి చేసుకోవాలన్నారు. ఉల్లి పంట సున్నిత పంట కావడంతో ఎప్పటిప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. పత్తి పంటలో పచ్చ, తెల్ల దోమ ఉధృతంగా ఉందని రైతులు నివారించుకోవాలన్నారు. యాంత్రీకరణ పథకం ద్వారా పంటల సాగులో ఖర్చులు తగ్గించుకుని మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. మినుము పంటలో వచ్చే పల్లాకు, ఆకుమచ్చ తెగుళ్ల నివారణకు ఎక్సాక్రో నోజోల్ 2ఎం.ఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. వేరుశనగ పంటలో కలుపు నివారణకు విత్తిన 15 రోజుల తర్వాత ఇమాజీపీర్ 10ఎం.ఎల్ లీటరు నీటిలో పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సురేష్, వీహెచ్ఏ లక్ష్మీ, రైతులు పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి



పంటలను పరిశీలిస్తున్న ఏఓలు సరస్వతి, సుచిత్ర తదితరులు

కమలాపురం : జింక్ సల్ఫేట్ కావలసిన రైతులు తమ పరిధిలోని ఆర్ఎస్‌కేలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని మండల ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని నల్లలింగాయపల్లె, తురకపల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది.. కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ఉల్లి, మినుము పంటలను పరిశీలించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. వేసవిలో సాగు చేసే పంటలైన వరి, ఉల్లి, మినుమ పంటల గురించి అవగహన కల్పించారు. పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. జింక్ సల్ఫేట్ కావాల్సిన రైతులు తమ పరిధిలోని ఆర్ఎస్‌కేలకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. డీఆర్‌సీ ఏఓ సుచిత్ర మాట్లాడుతూ ప్రతి రైతు సాగుకు ముందు తమ పొలంలోని మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆ ఫలితాల ద్వారా అధికారుల సూచన మేరకు తగిన మోతాదులో ఎరువులు వాడాలన్నారు. తద్వారా పంట దిగుబడులు పెరగడంతో పాటు ఖర్చు తగ్గుతుందన్నారు. అనంతరం పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను, పలు పంటలలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, వీఏఏలు పాల్గొన్నారు.

దోమల నివారణతో ప్రాణాంతక వ్యాధులు దూరం



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారిణి మనోరమ

సింహాద్రిపురం : దోమల నివారణతో ప్రాణాంతక వ్యాధులు దూరమవుతాయని జిల్లా మలేరియా అధికారిణి మనోరమ తెలిపారు. మంగళవారం మండలంలోని బిదినంచర్ల పీహెచ్‌సీలో ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా మలేరియా అధికారిణి హాజరై దోమకాటువల్ల సంభవించే మలేరియా, డెంగీ, చికన్‌గున్యా వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. అలాగే ఫ్రైడే – డ్రై డే కార్యక్రమ ప్రాధాన్యతను, ప్రతి శుక్రవారం ఇంటింటా నిల్వ నీటిని తొలగించడం ద్వారా దోమల పెరుగుదలను నిరోధించగలమన్నారు. అలాగే దోమల నివారణ పద్ధతుల గురించి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, ఆరోగ్య విస్తరణాధికారి సుకుమార్, పీహెచ్ఎన్ పద్మావతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులలో మయోపియా కంటి వ్యాధి

కడప కోటిరెడ్డి సర్కిల్ : చిన్నారులలో మయోపియా కంటి వ్యాధి పెరుగుతోందని, తగిన జాగ్రత్తలు తీసు కోవాలని ఎల్‌వీపీఈఐ వైద్యులు, మయోపియా స్పెషలిస్ట్ డాక్టర్ కావ్యమాధురి బెజ్జంకి సూచించారు. కడప లోని డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రాంగణంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ మయోపియా కంటి వ్యాధిపై పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా కావ్యమాధురి బెజ్జంకి మాట్లాడుతూ పిల్లలలో మయోపియా 2050 నాటికి ప్రపంచ జనాభాలో సగం మందికి మయోపియా వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. ఆరు కంటే ఎక్కువ డయోప్టర్లున్న పిల్లల జీవితంలో అంధత్వ సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుందన్నా రు. మయోపియా వ్యాధి సోకిన వారంతా దగ్గర వస్తువు స్ప ష్టంగా చూడగలుగుతారని, దూరపు వస్తువులు అస్పష్టంగా కనిపిస్తాయన్నారు. కొంతమంది పిల్లలు బోర్డు మీద కనిపించే వాటిని చూసి రాసుకోలేక పక్కవారి నోట్స్ చూసి రాసుకుంటారన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం సులభతరం



బైక్ ర్యాలీలో పాల్గొన్న మెజిస్ట్రేట్ మధుసూధన్‌రావు

కమలాపురం : కోర్టు కేసుల్లో మధ్యవర్తిత్వం అనేది ఒక న్యాయ ప్రక్రియ అని, దీని ద్వారా కేసులు సులభంగా పరిష్కరించుకోవచ్చని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ మధుసూధన్‌రావు తెలిపారు. మంగళవారం మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీలో ఆయన న్యాయవాదులు, పోలీసులతో కలసి పాల్గొన్నారు. స్థానిక కోర్టు నుంచి క్రాస్ రోడ్డు వరకు బైక్ ర్యాలీ నిర్వహించి మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ మాట్లాడుతూ రెండు లేదా అంత కంటే ఎక్కువ పక్షాలు ఒక మధ్యవర్తి సహాయంతో వివాదాలు పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ మధ్యవర్తి పార్టీల మధ్య సంభాషణను సులభతరం చేసి పరస్పర అంగీకారంతో కూడిన పరిష్కారానికి చేరుకోవడానికి వీలుంటుందన్నారు. ఇదొక న్యాయ ప్రక్రియ అని, ఈ ప్రక్రియ ద్వారా కేసులు సులభంగా పరిష్కరించు కోవచ్చన్నారు. మధ్యవర్తిత్వ ప్రక్రియలో పార్టీలు తమ సమస్యలను వివరించి తమ అభిప్రాయాలను తెలియజేస్తారన్నారు. మధ్యవర్తి, ఇరు పక్షాల వాదనలను విని, వారి సమస్యలను అర్థం చేసుకుని, ఒక పరిష్కారానికి రావడానికి సహాయం చేస్తారన్నారు. పార్టీలు మధ్యవర్తిత్వంలో అంగీకారానికి రాకపోతే, వారు కోర్టుకు వెళ్లవచ్చన్నారు. కార్యక్రమంలో కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే క్రిమినల్ కేసులు



వేంపల్లెలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్, వ్యవసాయ శాఖల అధికారులు



పులివెందులలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు



ముద్దనూరులో తనిఖీచేస్తున్న విజిలెన్స్ అధికారులు

వేంపల్లె : రైతులకు పురుగు మందులు, ఎరువులు అధిక ధరలకు, సరైన బిల్లులు లేకుండా విక్రయాలు చేస్తే అలాంటి ఎరువుల దుకాణాల యాజమానులకు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తిరుపతి విజిలెన్స్ డీఎస్పీ మల్లికార్జునరావు, కర్నూలు జిల్లా ఏడీఏ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం వేంపల్లెలోని పురుగు మందులు, ఎరువుల దుకాణాలను రాష్ట్రస్థాయి అంతర్ జిల్లా విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ అధికారుల బృందం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. వేంపల్లెలోని బైరిశెట్టి గంగిశెట్టి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్, తేజ ఫెర్టిలైజర్ షాపులతో పాటు ఇతర ఎరువుల దుకాణాలను తనిఖీలు చేసి దుకాణాల్లో ఉన్న పురుగుల మందు, ఎరువులకు సంబంధించిన రికార్డులు, బిల్లు బుక్స్, స్టాకు వివరాలను పరిశీలించారు. విజిలెన్స్ అధికారులు చేసిన తనిఖీల్లో బైరిశెట్టి గంగిశెట్టి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో ఉన్న రూ.24 వేలు విలువ చేసే మెగ్నీషియం సల్ఫేట్ శాంపిల్ తీసి విక్రయాలను నిలుపుదల చేయాలన్నారు. దుకాణాల డీలర్లు అందరూ అన్ని రికార్డులను సక్రమంగా అమలు చేయాలని, బిల్లులు లేకుండా విక్రయాలు చేపట్టరాదన్నారు. రైతు కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు బిల్లులు తప్పకుండా ఇవ్వాలని, ప్రతి రోజూ అమ్మకాలకు చెందిన రికార్డులను నమోదు చేయాలన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులనే విక్రయాలు చేపట్టాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయాలు జరపాలన్నారు. ఈ తనిఖీలలో డీఏఓ ఆఫీస్ ఏఓ గోవర్ధన్, ఏఓ శివశంకర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల రూరల్ : మండలంలో ఎరువుల దుకాణాలపైన మంగళవారం విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. విజిలెన్స్ డిపార్ట్‌మెంట్స్ డీఎస్పీ పి.మల్లికార్జునరావు, వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.వెంకటేశ్వర్లు, ఏఓ చెన్నారెడ్డి, ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. పట్టణంలోని శ్రీగురుబాలాజి ఫర్టిలైజర్స్ షాపులో అనుమతి పారాలు లేనందున రూ.5.92 లక్షలు విలువ చేసే ఎరువులు, అలాగే శిరీష ఫర్టిలైజర్స్ దుకాణంలో వివిధ కారణాలతో సుమారు రూ.15.36 లక్షలు విలువచేసే ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. 21 రోజుల్లో సంబంధిత పత్రాలు సమర్పించాలని, లేకుంటే ఎరువుల నియంత్రణ చట్టం 1985 ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్యాలయ టెక్నికల్ ఏఓ గోవర్ధన్, పులివెందుల వ్యవసాయ డివిజన్ టెక్నికల్ ఏఓ సునీల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ముద్దనూరులో..

ముద్దనూరు : మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో మంగళవారం సాయంత్రం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేపట్టారు.ఎన్ఫోర్స్‌మెంట్ డీఎస్పీ మల్లికార్జునరావు, కర్నూలు ఆర్సీ ఏడీఏ వెంకటేశ్వర్లు, ఎస్ఐ గోవర్ధన్‌లు స్థానిక మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డితో కలిసి తనికీలు చేశారు. రైతులకు నాణ్యమైన, అనుమతి కలిగిన ఎరువులు, పురుగుమందులను మాత్రమే విక్రయించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరల మేరకే అమ్మకాలు జరపాలని, లైసెన్స్‌లు లేకుండా వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ సందర్భంగా పలు రికార్డులను అధికారులు పరిశీలించారు.